• మిచాంగ్ ఎఫెక్ట్

ఉప్పు.. ముంపు

సీజన్ ఆరంభంలోనే ఉప్పు సాగుపై మిచాంగ్ పడగ



తుపాను ధాటికి జలమయమైన ఉప్పు మడులు

తగరపువలస: ఉప్పు సీజన్ సాగు ఆరంభంలోనే మిచాంగ్ తుపాను పడగ విప్పడంతో భీమిలి మండలం మూలకుద్దు సాగురైతులు వణికిపోతున్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు అప్పులు చేసి లీజుకు తీసుకున్న గల్లీలను రెండు మాసాలుగా బాగుచేసి సాగుకు సిద్ధం చేసుకున్నారు. ప్రారంభంలో స్వల్పంగా ప్రారంభమయ్యే దిగుబడుల కారణంగా ఉప్పు ధర అధికంగా ఉంటుంది. 80 కిలోల బస్తా ధర రూ.350పైగా పలుకుతుంది. సంక్రాంతి తరువాత ఉప్పు దిగుబడి భారీగా పెరగడంతో ధరలు తగ్గి అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం ప్రారంభ దశలో ఉన్న దిగుబడి కారణంగా ఎకరాకు రెండు వారాలకు గాను 5 బస్తాల వరకు దిగుబడి ఉంటుంది. ఎండలు పెరిగే కొద్దీ దిగుబడి 30 బస్తాల వరకు పెరుగుతుంది. మూలకుద్దు, రేఖవానిపాలెం పంచాయతీలకు చెందిన సాగురైతులు, కూలీలకు కలపి ఇక్కడ సాగయ్యే 99 ఎకరాలలో ఏటా 8 మాసాలు 300 మంది వరకు ఉపాధి లభిస్తుంది. సీజన్ మధ్యలో భారీ వర్షాలు వస్తే సాగుకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. చిన్నపాటి వర్షాలు కురిస్తే పది రోజులలో గల్లీలను యథాస్థితికి తీసుకురావచ్చు. పెద్ద వర్షాల కారణంగా మళ్లీ పుంజుకోవడానికి ఈ సమయం నెల వరకు పట్టవచ్చు.

సంక్రాంతి వరకు వేచి చూడక తప్పదు

ప్రస్తుతం సీజన్ ప్రాంభంలోనే తుపాను విరుచుకు పడటంతో ఉప్పు సాగుకు బ్రేకులు పడ్డాయి. దీని నుంచి కోలుకోవడానికి గాను ఇక్కడి రైతులకు నెలరోజుల సమయం పట్టవచ్చు. దీంతో సంక్రాంతి తరువాతే ఉప్పు దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. తుపాను కారణంగా సీజన్‌లో రెండు మాసాల పాటు రైతులకు నష్టంతో పాటు కూలీలకు ఉపాధి ఉండదు. ఇక్కడ సాగయ్యే ఉప్పును ఎక్కువగా ఒడిశా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, బీహార్ రాష్ట్రాలలోని కొబ్బరితోటలు, కోళ్ల, పశువుల దాణాలలోని మిశ్రమాలకు వినియోగిస్తుంటారు. సీజన్ 8 నెలలే ఉన్నా ఉప్పు దిగుమతులు బట్టి ఎగుమతులు ఏడాది పొడవునా ఇక్కడ జరుగుతాయి.



తుపాను నుంచి రక్షణగా గల్లీలలో ఉప్పు కుప్పలలో పరదాలు

కూలిన ఆలయ ప్రహరీ



కుంగిన నేల

తగరపువలస: స్థానిక శ్రీరమా సత్యనారాయణ స్వామి కొండపై ఆలయానికి ముంపు పొంచి ఉంది. కొండపై ఆలయం వెనుక, కుడివైపున ప్రహరి కూలడంతో పాటు నేలభాగం కుంగిపోయింది. దీంతో కొండపై వెళ్లిన భక్తులు కూలిన ప్రహరీ, కుంగిన నేలవైపు వెళ్లకుండా అర్చకుడు జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని భక్తులు ఆందోళన చెందుతున్నారు. కొండపై ఆలయం చుట్టూ కాంక్రీట్ దిమ్మె నిర్మించి దానిపై పటిష్టమైన ప్రహరీ, నేలను నిర్మించాలని భక్తులు కోరుతున్నారు. అంతేకాకుండా మెట్ల మార్గంలో రాళ్లు చీలకుండా అందులో కాంక్రీట్ ఫిల్లింగ్ చేయాలని కోరుతున్నారు.



విరిగిపడిన చెట్లు

వర్షంతో అవస్థలు

పద్మనాభం: మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల రెండు రోజుల నుంచి వర్షాలు కురవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మద్ది, రేవిడి గ్రామాల్లో పక్వానికి వరి పంట నేల కొరగింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట నేల కొరగడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెడ్డిపల్లి ఏఎస్ఎం సబ్ సెంబర్ భవనం శ్లాబు పెచ్చు లూడింది. విజయగనగరం-శొంత్యాం ఆర్అండ్‌బీ రోడ్డు మద్ది జంక్షన్, విజయానందపురం జంక్షన్,పద్మనాభం-మహారాజుపేట ఆర్అండ్‌బీ రోడ్డు కురపల్లి, రేవిడి పీహీచ్‌సీ వద్ద జలమయమయ్యాయి. దీని వల్ల ఈ రోడ్లపై పయణించడానికి వాహన చోదుకులు అవస్థలు పడ్డారు.




మద్దిలో నేలకొరిగిన వరి పంట



పెచ్చులూడిన రెడ్డిపల్లి ఏఎస్ఎం సబ్ సెంటర్ భవనం



తుపాను కారణంగా ఎడ తెరిపి లేని వర్షానికి మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద నీరు చేరడంతో వాహనదారుల అవస్థలు పడ్డారు. తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డుపైకి వచ్చినవారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. - మధురవాడ



రహదారుల జలమయం



పీఎంపాలెం రహదారిపై నిలిచిన నీరు

పీఎంపాలెం: మిచాంగ్ తుపాను కారణంగా రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు కారణంగా పీఎం పాలెం ప్రాంతాల్లో జన జీవనం స్తంభించింది. అధిక శాతం షాపులు మూతపడ్డాయి. కారు షెడ్ కూడలి నుంచి పీఎంపాలెం ఆఖరి బస్టాప్‌కు వెళ్లే రోడ్డు వరకు వర్షంనీరుతో జలమయమయ్యాయి. హౌసింగ్ బోర్డు కాలనీ, గాయత్రి నగర్, బాబానగర్ తదితర కాలనీ ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. రోజంతా వర్షం కురవడంతో పాటు చల్లని గాలులు వీయడంతో చిన్నారులు,వృద్ధులు ఇబ్బందులు పడ్డారు.

వర్షానికి తడిచిన ధాన్యం



బోని పొలాల్లో తడిసిన ధాన్యాన్ని గోనె సంచెలకు ఎత్తుతున్న రైతులు

ఆనందపురం : మిచాంగ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాలలో నూర్పులు అయి పొలాల్లోనే ఉన్న ధాన్యం తడిచి పోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. రెండు రోజులగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో నీరు చేరడంతో రైతులకు కంటిమీద కునుకులేకుండా ఉన్నారు. బోని, కుసులువాడ, పెద్దిపాలెం, పొడుగుపాలెం తదితర గ్రామాలలో యంత్రాలతో నూర్పులు చేశారు. ధాన్యాన్ని పొలంలోను ఖాళీ ప్రదేశాలలో ఆరబెట్టారు. కాగా మంగళవారం రోజంతా వర్షం కురవడంతో ధాన్యం ఆరబెట్టిన ప్రాంతాలలో నీరు చేరడంతో పరదాలు కప్పి రక్షించుకునే ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం లేదని రైతులు అంటున్నారు. ధాన్యం పూర్తిగా తడిచి పోయిందని, మరో రెండు రోజులు ఇదే పరిస్థితి ఉంటే మొలకలు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ గ్రామాల్లో ఇంకా కోత కోయకుండా ఉన్న వరిపంట వర్షానికి పూర్తిగా నేలబారింది. దీంతో వరిచేను నీట మునిగి పాడవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేస్తున్నారు.

క్లుప్తంగా

చెస్ విజేతలకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న అనిట్స్ కళాశాల యాజమాన్యం

తగరపువలస: ఈ నెల 1,2వ తేదీల్లో కొమ్మాది గాయత్రీ విద్యాపరిషత్‌లో జరిగిన ఆంధ్ర విశ్వ విద్యాలయ పరిధి అంతర కళాశాలల మెన్స్ చెస్ చాంపియన్‌షిప్‌లో సంగివలస అనిట్స్ విద్యార్థులు విజేతులుగా నిలిచారు. వీరిలో ఎ.వెంకట సాయి కౌశిక్, ఆర్.తరుణ్‌సాయి, పి.విజయరామ మౌర్య, ఎస్.సాయికిషోర్, బి.శ్రీనుబాబు ఉన్నారు. వీరిని మంగళవారం ప్రిన్సిపాల్ కె.శ్రీరామకృష్ణ, వివిధ విభాగాధిపతులు బి.నాగరాజు, జె.విజయకుమార్, ఎం.రామకృష్ణమూర్తి, క్రీడా దర్శకుడు కె.వేణుగోపాల్ తదితరులు అభినందించారు.

స్టాఫ్ నర్స్‌కు గాయాలు



చికిత్సపొందుతున్న నర్సు సుజాతను పరామర్శిస్తున్న జెడ్సీ రాము

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న స్టాఫ్ నర్సు, ఆమె తండ్రి గాయపడగా వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ స్టాఫ్ నర్సుగా పని చేస్తున్న సుజాతను మంగళవారం మధ్యాహ్నం ఆమె తండ్రి సూరిబాబు ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని తగరపువలసలోని తమ ఇంటికి బయలుదేరారు. వుడా మైదానం వద్దకు వచ్చేసరికి రోడ్డుపక్కనున్న చెట్టు కొమ్మ విరిగి వీరిపై పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము వెంటనే వారికి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతానికి పాడి గేదె మృతి

తగరపువలస: భీమిలి మండలం గొల్లల తాళ్లవలసకు చెందిన పాడిరైతు గొలగాని రాముకు చెందిన పాడిగేదె మంగళవారం విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడింది. జాతీయ రహదారిపై పెద్దిపాలెం వద్ద నేలపై పడిన ట్రాన్స్‌ఫార్మర్ వైరు గేదెకు తగిలి మృతి చెందింది. దీని విలువ రూ.25వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

అమర జవాన్‌కు ఘన నివాళి



హుస్సేన్ స్మారక చిహ్నం వద్ద నివాళులర్పిస్తున్న కమాండెంట్ భటేరియా

ఆనందపురం : మండలంలోని పందలపాకలోని 56వ ఐటీబీపీ ఫోర్స్‌లో పనిచేస్తూ విధి నిర్వహణలో అమరుడైన కానిస్టేబుల్‌కు అధికారులు ఘనంగా నివాళులర్పించారు. కృష్ణా జిల్లా అవనిగడ్డకు చెందిన జీడి షేక్ హాజీ హుస్సేన్ 2013లో ఐటీబీపీ ఫోర్స్‌లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. ఇక్కడ విధులు నిర్వహిస్తూ 2019లో ఉత్తరాఖండ్‌లోని పితోర్‌ఘర్‌లో విధి నిర్వహణలో భాగంగా అమరుడయ్యాడు. ఈ మేరకు హుస్సేన్ విద్యాభ్యాసం చేసిన అవనిగడ్డ ఉన్నత పాఠశాల వద్ద గ్రామస్థులు స్మారక చిహ్నం ఏర్పాటు చేశారు. ఈ మేరకు మంగళవారం అంతిమ త్యాగ దినోత్సంలో భాగంగా పందలపాక బెటాలియన్ కమాండెంట్ డీకే భటేరియా సిబ్బంది హుస్సేన్ స్మారక చిహ్నం వద్ద ఘనంగా నివాళులర్పించారు.

దవడ శస్త్ర చికిత్సపై వర్క్ షాప్

కొమ్మాది: దవడలో ఏర్పడే లోపాలను సవరించడానికి దంత వైద్యంలో ఓరల్, మాక్సిల్లో ఫేషియల్ శస్త్ర చికిత్స నిపుణులు అరుదుగా నిర్వహించే ఆర్థోగ్నాంథిక్ (దవడ శస్త్ర చికిత్స) సర్జరీపై గీతం దంత వైద్య కళాశాల ఆస్పత్రిలో మంగళవారం ప్రత్యేక వర్క్ షాప్ నిర్వహించారు. మాక్సిల్లో ఫేషియల్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ ఎం. వీరబాహు పాల్గొని శిక్షణ ఇచ్చారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ



తాటితూరు పైడితల్లమ్మ



రాచపోలమాంబ అమ్మవారు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు గ్రామదేవత పైడితల్లి అమ్మవారిని మంగళవారం తులసి మాలలు, పూలదండలతో అలంకరించారు. గోలి సాయిరాం, ఆకిరి చంద్రశేఖర్, ఆకిరి హేమంత్‌కుమార్ ఆర్థిక సాయంతో సరగడ వేణురెడ్డి, సతీష్‌రెడ్డి, సాయిరెడ్డి, హేమంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డి అమ్మవారిని అలంకరించారు. మజ్జివలస పంచాయతీ గ్రామదేవత రాచ పోలమాంబ అమ్మవారిని కాగితాల బాలాజీ, పద్మ బహూకరించిన అద్దాల చీరతో ఆలయ కమిటీ అలంకరించింది. ఈ ప్రత్యేక అలంకరణలతో అమ్మవార్లను ఆ రెండు పంచాయతీల ప్రజలు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రజల చెంతకు పాలన జగన్‌కే సాధ్యం



రేవళ్లపాలెంలో సంక్షేమ పథకాలు బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

మధురవాడ: తుపాను కారణంగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మధురవాడ జీవీఎంసీ 6వ వార్డుల్లోని రేవళ్లపాలెంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రేవళ్లపాలెం వార్డు సచివాలయం సమీపంలో వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఎగురవేసి, సంక్షేమ కార్యక్రమాలు బోర్డును జేసీఎస్ కన్వీనర్ గాదే రోశిరెడ్డి, సచివాలయ కన్వీనర్ పిళ్లా రమణ, 6వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జ్ బొట్ట అప్పలరాజు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజల వద్దకే పాలన, సంక్షేమ పథకాలు అందించారన్నారు. సంక్షేమ పాలన మళ్లీ కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. కార్యక్రమంలో వివిధ విభాగాలు నాయకులు, కన్వీనర్లు వాండ్రాసి సూరి అప్పారావు, పిళ్లా విజయదుర్గ, నాగోతి లక్ష్మణరావు, పలువురు గృహసారథులు ఇతర నాయకులు పాల్గొన్నారు.

మధురవాడ వెళ్లి పింఛన్ అందజేత



జానకమ్మకు పింఛన్ అందజేస్తున్న లక్ష్మీమౌనిక

మహారాణిపేట : జీవీఎంసి జోన్-4 పరిధిలో నివసిస్తున్న జానకమ్మకు వార్డు కార్యదర్శి లక్ష్మీమౌనిక మంగళవారం పింఛన్ అందజేశారు. 30వ వార్డు అఫీషియల్ కాలనీలో నివాసం ఉంటున్న జానకమ్మ చంద్రంపాలెంలోని వైజాగ్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో ఆశ్రయం పొందుతోంది. ఈ విషయమై బంధువులు సమాచారం ఇవ్వడంతో సచివాలయ కార్యదర్శి లక్ష్మీమౌనిక స్పందించి జానకమ్మ ఉంటున్న ఏరియాకు వెళ్లి పింఛను అందజేశారు. మధురవాడ వచ్చి పింఛను ఇవ్వడంతో జానకమ్మ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

జోన్-5లో షాపులకు 22న బహిరంగ వేలం

కంచరపాలెం: జీవీఎంసీ జ్ఞానాపురం జోన్-5 పరిధిలోని 40వ వార్డు నుంచి 63వ వార్డు వరకు గల 24 వార్డులకు సంబంధించిన ఖాళీగా ఉన్న దుకాణాలు, కల్యాణ మండపాలు, రోడ్డు పక్కన మార్కెట్లకు ఈ నెల 22న శుక్రవారం ఉదయం 10 గంటలకు జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 60వ వార్డు గుల్లలపాలెం షాపింగ్ కాంప్లెక్స్‌లో 8, 15, 41, 46, 48, 52, 55, 56, 57, 58 నంబర్ల దుకాణాలు, సుబ్బలక్ష్మినగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 3, 9, 13, 14 నంబర్ల షాపులు, సంజీవయ్య కాలనీ షాపింగ్ కాంప్లెక్స్‌లో 1, 2 షాపులు, ములగాడ షాపింగ్ కాంప్లెక్స్‌లో 2, 4, అశోక్‌నగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 1, 2 నంబర్ల షాపులకు మూడేళ్ల కాల పరిమితి, జీవీఎంసీ 51వ వార్డు మాధవస్వామి కల్యాణ మండపానికి మూడేళ్ల పరిమితితో వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు.

తప్పిపోయిన చిన్నారుల అప్పగింత

తగరపువలస: దారి తప్పి వర్షంలో రామన్నపేట జాతీయరహదారి ఫ్లై ఓవర్ వద్ద మంగళవారం బిక్కుబిక్కుమంటున్న ఇద్దరు చిన్నారులను సాయి రవీంద్ర ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్ వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రి రహదారిలో స్క్రాప్ దుకాణంలో పనిచేస్తున్న తల్లిదండ్రులకు చిన్నారులను అప్పగించారు.

పలు ఐవీఎఫ్ సెంటర్ల తనిఖీ



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో గల పలు ఐఆర్‌టీ, ఐవీఎఫ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆడమ్స్ ఐవీఎఫ్ కేంద్రంలో ఏఆర్‌టీ బ్యాంక్, పద్మశ్రీ ఐవీఎఫ్‌లో ఏఆర్‌టీ లెవల్-2, అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో ఏఆర్‌టీ లెవెల్-1, గీతం ఆస్పత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాలకు పలు సూచనలు చేశారు. ఆపరేషన్ థియేటర్, వార్డు, స్కానింగ్ మెషీన్లను తనిఖీ చేశారు. ఆస్పత్రులకు ఏఆర్‌టీ కేంద్రాల నిర్వహణకు అనుమతులు ఉన్నాయో లేదో, వైద్యులు, ఉద్యోగుల విద్యార్హతలను పరిశీలించారు. ల్యాబ్ పరికరాలను పరిశీలించి సలహాలు ఇచ్చారు. ఈ కేంద్రాల్లో పేదవారికి ఫీజు తగ్గించి తీసుకోవాలని కోరారు. ఈ తనిఖీ బృందంలో డాక్టర్ గీతా వందన, ఎల్.వి.రమణి, డాక్టర్ బి.ఉమావతి, బి.నాగేశ్వరరావు, కె.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

నిండుగా గోస్తనీ నది



తగరపువలస జాతీయరహదారి వంతెన వద్ద నిండుగా ప్రవహిస్తున్న గోస్తనీనది

తగరపువలస: రెండు రోజుల పాటు కురుస్తున్న కుండపోత వర్షానికి గోస్తనీనది నిండు కుండలా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి కురుస్తున్న వర్షాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలోని వ్యవసాయ భూముల ద్వారా వచ్చిన నీరు నదిలో చేరుతుంది. భీమిలి మండలంలోని తాటితూరు, టి.నగరపాలెం, మూలకుద్దు, తగరపువలస వద్ద నది ఉధృతిగా ప్రవహిస్తోంది. చాలా వరకు ఊటబావులు నదిలో మునిగిపోయాయి. మరొకవైపు చెరువులు కూడా వర్షంనీటిలో మునిగిపోయాయి.

లలితా పీఠంలో చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సీతంపేట: స్థానిక లలితానగర్‌లోని లలిత పీఠంలో కార్తీక మాసం, బహుళ అష్టమి సందర్భంగా మంగళవారం ఉదయం చండీ హోమం నిర్వహించారు. పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా హోమం జరిపించారు. గణపతి పూజ, కలశ శుద్ధి, అగ్ని ప్రతిష్టాపన, గోపూజ, పరివార పూజ, సుహాసిని పూజ, దంపత పూజ, చండీ సప్తశతి చివరగా పూర్ణాహుతి నిర్వహించారు. లోకకల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం నిర్వహించినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ తెలిపారు. సాయంత్రం 1000 గారెలతో కాళీ కాలభైరవ హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

10న విజిల్ బ్లోయర్ చిత్ర ప్రదర్శన

సీతంపేట: ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మానవ హక్కుల అంశంపై రూపొందించిన 'విజిల్ బ్లోయర్'ఆంగ్ల చిత్రాన్ని ఈ నెల 10వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రదర్శించనున్నట్టు వైజాగ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ సినిమా తిలకించడానికి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు.

కేంద్ర పథకాలతో రైతులకు మేలు



గిడిజాలలో కేంద్ర పథకాలపై ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆనందపురం : కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న పలు పథకాలతో రైతులకు మేలు జరుగుతోందని బీజేపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కంటుభుక్త రామానాయుడు చెప్పారు. మండలంలోని గిడిజాల, శిర్లపాలెం పంచాయతీలలో మంగళవారం భారత్ వికసిత్ ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డులు వంటి వాటిని అమలు జరపడం వలన ఏడాదికి వేల రూపాయల లబ్ధికలుగుతోందని వివరించారు. ఉజ్వల పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్‌లను అందిస్తోందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజేపి నాయకులు ప్రసాదరావు పట్నాయక్, మీసాల రామునాయుడు, బందారు అనీల్ కుమార్, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, సర్పంచ్‌లు షిణగం అప్పలరాజు, శిర్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.